# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. భారత్-మలేషియా దేశాలు మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
2. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి నియోజకవర్గంలోనూ ఒక నగర వనాన్ని ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
3. భవన నిర్మాణాలకు ఏక గవాక్ష విధానంలో త్వరితగతిన అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి నారాయణ అధికారులను ఆదేశించారు.
4. ఆంధ్రప్రదేశ్‌లో 100 రోజుల కార్యాచరణతో ఇళ్ల నిర్మాణాల పూర్తి చేయనున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.
5. తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

==========================

ఇండో పసిఫిక్ ప్రాంతంలోనూ, ఆసియాన్ కూటమిలోనూ, మలేషియా భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నిన్న ఢిల్లీలో మలేషియా ప్రధాని డాటో సెరి అన్వర్ బిన్ ఇబ్రహీం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ.. భారత్-మలేషియా దేశాలు మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాయన్నారు. ఇరు దేశాలు డిజిటల్ సాంకేతికత, క్రీడలతో పాటు సహకార రంగాలలో పలు ఒప్పందాలపై సంతకాలు చేశాయని ప్రధాని వివరిస్తూ...

..వాయిస్..30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి నియోజకవర్గంలోనూ ఒక నగర వనాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి అటవీ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నగర వనాల ఏర్పాటు కోసం జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల్ని ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పర్యావరణహిత పర్యాటక కేంద్రాల్ని అభివృద్ధి చేసేందుకు అనువైన ప్రదేశాల్ని గుర్తించాలని,

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉన్న అవకాశాల్ని వినియోగించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణాలకు ఏక గవాక్ష విధానంలో త్వరితగతిన అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి నారాయణ అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులు సులభతరం చేసే విషయమై చర్చించేందుకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, అగ్నిమాపక, రెవెన్యూ, గనులు తదితర శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని శాఖల నుంచి అభివృద్ధి అనుమతి నిర్వహణ వ్యవస్థ–డీపీఎంఎస్ పోర్టల్ ద్వారా ఒకేసారి అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భూ వినియోగ మార్పిడికి సంబంధించి రెవెన్యూ శాఖ ఇచ్చే అనుమతులు సులభతరం చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 100 రోజుల కార్యాచరణ కింద లక్షా 25 వేల ఇళ్ల నిర్మాణాల పూర్తి చేయనున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే ఏడాది కాలంలో 7 లక్షల ఇళ్లను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ఒకటవ దశ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తవుతున్న నేపథ్యంలో గడువులోపు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (30సెకన్లు)

---------------------------

వైద్యుల నిరసన నేపథ్యంలో కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు నిన్న విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది భద్రత విషయంపై ఆసుపత్రులు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది. జూనియర్ వైద్యులకు పని ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరమని విచారణ సందర్భంగా వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపింది. వైద్యుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై మూడు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇవ్వాలని ధర్మాసనం కమిటీకి సూచించింది. అలాగే రెండు నెలల్లోగా తుది నివేదిక సమర్పించాలని వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో హిందూస్థాన్ కంప్యూటర్ లిమిటెడ్ –హెచ్‌సీఎల్ కార్యకలాపాలను విస్తరించనుందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. నిన్న గుంటూరు జిల్లా ఉండవల్లిలో హెచ్‌సీఎల్ ప్రతినిధులతో మంత్రి సమావేశమైయ్యారు. విస్తరణ ద్వారా రాష్ట్రంలో మరో 5 వేల 500 మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. నూతన కార్యాలయం నిర్మాణం చేపట్టి మరో

10వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. సాంకేతిక సమాచార రంగంలో ప్రస్తుతం అంతర్జాతీయ నైపుణ్యాలకు అనుగుణంగా అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్న హెచ్‌సీఎల్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని లోకేష్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంతోపాటు.. 2047 నాటికి 45 వేల డాలర్ల తలసరి ఆదాయం, 2 ట్రిలియన్ డాలర్ల ఆదాయం కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047' ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, శాఖాధిపతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ, సామాజిక, భౌతిక, మౌలిక సదుపాయాల వృద్ధి, జనాభా నిర్వహణ విధానాలతో ప్రతి జిల్లాకు ఐదేళ్ల ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం ఉత్తర తమిళనాడు దానికిఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా ఆంధ్రపద్రేశ్ మీదుగా సగటున సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్లవరకూ వ్యాపించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని పభ్రావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొంది.

తెలంగాణలో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

---------------------------

తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాల నేపథ్యంలో జనజీవనానికి ఎలాంటి ఇబ్బంది ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక పరిస్థితులను బట్టి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

---------------------------

తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. దీర్ఘకాలిక ప్రణాళికలతో అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో క్రెడాయ్ తెలంగాణ స్టేట్ కాన్ 2024 ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు పాల్గొని మాట్లాడారు.

=====================